ప్రాప్తి

మేడమెట్లు దిగుతూ సరళ సోఫామీద కూర్చుండటం చూచి మరీ వేగం హెచ్చించి చప్పున క్రిందికి దిగింది జయ.

"ఇంతసేపూ యెదురు చూశానే.. యింతవరకూ యేం చేస్తున్నావే!" అంది జయ సరళ ప్రక్కనే కూర్చుంటూ. సరళ నవ్వుతూ

"నీలా నాకెలా అవుతుందే—యింటిపనులన్నీ అమ్మతోపాటు నేనూ చక్కబెట్టుకురావాలిగా" అంది సరళ.

"పోనీగాని యేమైనట్టు నీ చదువు! మొదటి నిర్ణయమే స్థిరమయిందా?"

"అంతే జయా! నా చదువు కిహ స్వస్తిచెప్పాల్సిందే!"

"నువ్వింకా చదువుతే బావుండేది."

"బావుండేదే...కాని అంత తాహతుండొద్దూ జయా!" అంది సరళ. జయ బుంగ మొహం వేసుకుంది.

"ఎప్పుడూ తాహతుల్నే తెచ్చిపెడతా వెందుకనో!" అంది జయ

"ఔను జయా! చదువుకుందుకు డబ్బుండాలి. నాలాంటి సామాన్యుల కెలాసాధ్యమౌతుంది చెప్పు?"

"వున్నదాంతో నే సంతృప్తి పడుతూ సామాన్యజీవితంలో చదువుకుంటున్నవాళ్ళు లేరంటావా?"

"వున్నారులే...కాని మా నాన్నకి నన్నింకా చవించాలసి లేదు జయా! నన్నో యింటిదాన్నిగా చెయ్యాల

ఆయన అభిలాష” అంది సరళ సిగ్గుతో మొహం దించు కుంటూ.

“అబ్బో! అవుతే నువ్వు పెళ్లికూతురివి కాబోతున్నా వన్నమాట” అంది నవ్వుతూ కళ్ళు పెద్దవిగాచేస్తూ జయ.

“అప్పుడే కాదులేవే!”

“ఇప్పుడు కాకపోతే, మరికొన్నాళ్ళు పోయాక; ఔనా మరి...”

“నన్నంటున్నావు గానీ, నువ్వుమాత్రం కావేవిఁటి?”

“నామాట వదిలేయ్ సరళా...ఆ, అవుతే పెళ్ళికొడు కెవరో తెలుసుకోవచ్చా?” తమాషాగా అడిగింది జయ.

“ఏమో నాకేం తెలుసే—యింకా నిశ్చయంకాలేదు.”

“పెళ్ళనగానే సంబరం కాదు సరళా! అన్ని విషయాలు బాగా ఆలోచించి పెళ్ళిచేసుకో.”

“మన ఆలోచ నేముందిలేవే! పెద్దలున్నారుగా ..అవుతే నువ్వెంతవరకు చదవాలనుకొంటున్నావే?

“డాక్టరీ చదవాలనివుందే...”

“అప్పుడు నన్ను మర్చిపోవుకదా!” నవ్వుతూఅంది సరళ.

“చాల్లే! ఎందుకు మర్చిపోతాను!” అంది చిలిపిగా జయ.

“ఏమోలే...కాలం మారిపోయిందికదూ! పాత జ్ఞాప కాలుండవు...” అంది సరళ మాటలు తేలుస్తూ. చివరి కిద్దరూ నవ్వుకున్నారు.

"నీ వేళాకోళానికేం గానీ, జానకిఇంట్లో పార్టీ వుంది. వస్తావటే?" అంది జయ.

"నాకు పనుంది జయా! యిప్పుడు రాలేను..." మరేం అనుకోకేం? వస్తాను మరి..." అంటూ వెళ్ళిపోయింది సరళ. జయ వాచీ చూచుకుని మళ్ళీ తొందరగా మేడమెట్లెక్కిపోయింది.

కొద్దిదినాలు గడిచిపోయాయి. సరళవివాహం సక్రమంగా జరిగిపోయింది. పెళ్ళయిన పది దినాలతరువాత జయ సరళ యింటికివెళ్ళింది. సరళ జయని ఆహ్వానించింది. జయ కూర్చుంటూ—

"ఏఁవిటే సరళా! పెళ్ళయింతర్వాత దర్శనాలే లేకపోయాయ్—మీ ఆయన విడిచిపెట్టలేదా?" అంది నవ్వుతూ.

"వూరుకుందూ! వీలుకుదిరితేగా రావటం మరి... నిన్నటివరకు బంధువులుండనేవున్నారు." అంది సరళ.

"ఆ! అన్నట్టు అడగాలని మర్చిపోయాను, మీ ఆయన ఎంతవరకు చదువుకున్నారేవిఁటి?"

"ఇంటరు చదువుతూ మానేశారుట"

"ఓస్! యింతేనా! ఏం వుద్యోగం చేస్తున్నారు?" జయ మొదట్లోనే అంత చులకన కనబర్చటం సరళకి నొప్పికలిగించింది.

"ఏదో ఆఫీసులో క్లర్కు పనట"

"గుమాస్తాయా! నా సానుభూతిని యెలా తెలియజెయ్యాలో అర్థంకాకండావుందే సరళా" అంది జయ కాస్త

విచారాన్ని సూచిస్తూ. సరళకేమీ అర్థం కాలేదు సానుభూతేం దుకో! "సానుభూతా? ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎందుకా? నువ్వో గుమస్తాకి భార్యవయ్యావని"

"అవుతే యేమయిందీ?"

"ఏం? నీకేం బాధకన్పించటంలేదూ?" అదోలా చూస్తూ అంది జయ.

"లేదే..." తెల్లమొహం వేసింది సరళ.

"అవుతే నీలో అమాయకత్వం బాగా పేరుకుందన్న మాట"

"ఏమిటో నాకర్థంకా లేదే జయా!" విసుగ్గా అంది సరళ.

"ఓ గుమస్తాని పెళ్ళాడి యేంసుఖం అనుభవిస్తావే మరి...?" అంది జయ... అదీ తన సానుభూతికి కారణం. ఆమెదృష్టిలో గుమస్తాలు కీటకాల్లా అగుపిస్తున్నారు. సరళకి ఆమె అభిప్రాయం అంతగా నచ్చలేదు.

"ఏం, వాళ్ళల్లో మానవత్వం ఉండదనా? వాళ్ళు జీవించలేరంటావా?"

"జీవించలేరని కాదు సరళా! జీవిస్తారు... కాని జీవితంలో యెప్పుడూ పేదరికంతో పోరాడుతూంటే... దాంతో వారి మానవత్వంలో మార్పు అప్రయత్నంగానే వచ్చేస్తుంది".

"దానికేం చేస్తాంలే జయా! పేదరికం ప్రత్యేకవ్యక్తికి సంబంధించింది కాదు– సంఘానికి సంబంధించిందన్నాడో రచయిత. పేదవాళ్ళెంతోమంది వున్నారు సంఘంలో" అంది సమర్థించుకుంటూ సరళ.

"ఇంత సహనంతో యెలా ప్రతిఘటిస్తున్నావో

"ప్రతిఘటించాల్సిన క్లిష్టపరిస్థితులు రాలేదుకదూ జయా!"

"ఐతే నువ్వు ఆనందంగానే వున్నావంటావ్!" అంది జయ. ఆమె ఆశ్చర్యంగానేవుంది సరళ యెలా సహిస్తోందా అని... ఆమె మనస్తత్వం, పెరుగుతున్న వాతావరణం అల్లాంటివి.

"కాదు—తృప్తిగానే జీవిస్తున్నా; జీవిస్తానుకూడా" అంది సరళ చిన్నగా నవ్వుతూ.

'భర్త 'గుమాస్తా'అని చెప్పుకోవటం యెంతచిన్నతనం. నేనవుతే నిరాకరించి శాశ్వత బ్రహ్మచారిణిగా వుండిపోయే దాన్ని. కావలిస్తే...మా మేనమామ వున్నాడు లే...మాంచి ఆస్తిపాస్తులున్నాయి. అతనికి నన్నివ్వాలంటే అతను గుమస్తాగిరి వెలగబెడుతూండటంవల్ల యిష్టంలేదని చెప్పేశాను.... తెలుసా సరళా!" తన గొప్పతనాన్ని చెప్తూ తూ... జయ అలాఅన్నా సరళకి చిన్నతన మనిపించలేదు.

"నీకూ, నాకూ చాలా వ్యత్యాసాలున్నాయి జయా! నువ్వు ఆఫీసరుకూతురివి — నేను సామాన్యుని కూతుర్ని; నాకు గుమస్తాకాక యింకెవరు భర్తగా వస్తారు చెప్పు"అంది నవ్వుతూ సరళ.

"నువ్వెప్పుడూ యీ వ్యత్యాసాలు తెచ్చిపెడతా వెందుకే సరళా!"

"అందులో ప్రాముఖ్యత వుంది కాబట్టి"

"నేను నమ్మను..."

"నాకు నమ్మకమౌతుంది"

"ఫోన్సీ లేగానీ, ఆయనకి ఆ స్తిపాస్తు లేమన్నా వున్నాయా!" అంది జయ ...ఎందుకో ఆమె కివన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి!

"ఆస్తులేం లేవు జయా! అయినా నాకు సంతృప్తిగానే వుందే! ఎందుకనంటే, మా హృదయాలు అల్పసంతుష్టిగా తయారై స్థిరపడిపోయాయ్." అంది సరళ. జయ ముఖం ముడుచుకుంది.

"వూరుకుందూ! మాట్లాడితే 'మా' 'మీ' అన్న భేదాలు తెస్తుంటావ్... సరేగాని... యెప్పుడు వెళ్ళిపోతున్నావ్ అత్తారింటికి?" అంది జయ.

"అప్పుడే వెళ్ళను జయా! ఆయన కీ వూరు బదిలీ అయ్యే సూచనలు కన్పిస్తున్నాయంట... అందుకని వస్తుతం యిక్కడే వుంటాను," అంది సరళ... జయ టైంచూసుకుంటూ—

"మైగాడ్! అప్పుడే ఎంతవేళయిపోయింది! వస్తానే మరి..." అంటూ వెళ్ళిపోతుంది. జయ అభిప్రాయాలకి సరళ నవ్వుకుంది.

♦ ♦ ♦ ♦ ♦

జయ మేనమామ కామేశం, అతనికి మంచి స్థితిపాస్తులున్నయ్.... వూరికే కూర్చోవటం యెందుకని వున్నవూర్లో కలెక్టరేట్‌లో గుమస్తాగిరి వెలిగిస్తున్నాడు. అతనికి జయని ఇవ్వాలనివుంది... అదే విషయం జయతల్లి తనతో చెప్పింది తమ్ముడితో. కామేశం ఇంటరు చదివాడు... జయకూడా యింటరు చదువుతూండటం అతని కిష్టం లేదు.

"మీ తమ్ముడేమంటున్నాడు లక్ష్మీ!" అన్నాడు శంకర

రం—జయతండ్రి, భార్యతో. అతని అభిప్రాయం స్థిరపడింది జయకి మేనరికం చేస్తేనే మంచిదని.

"వాడేమంటాడండీ! జయ నింకా చదివించడటం యిష్టంలేదు వాడికి."

"ఏం...?"

"వాడే చదివింది ఇంటరు... ఓపార్టు పోయిందికూడా. జయకూడా ఇంటరుచదివితే తనకేం గౌరవముంటుందీ అంటాడు."

"ఔన్లే! వాడిఅభిప్రాయం బాగానేవుంది. కాని జయకి చదవాలనేవుంది. అసలు మీతమ్ముణ్ణి పెళ్ళిచేసుకోవటం దాని కిష్టంలేనట్లే అగుపిస్తుంది" అన్నాడు శంకరం.

"దానిమొహంలెద్దురూ ! యిష్టంకాక యేమయిందీ? మీకిష్టంలేదందురూ..." అంది లక్ష్మి సూటిగా భర్తముఖం లోకి చూస్తూ,

"అబ్బే...నాకేం ఆ అభిప్రాయం లేదు లక్ష్మీ! మన హోదాకితగ్గ అల్లుడు కావాలన్న వాంఛ ఓవేపునవున్నా, మీ తమ్ముడికున్న ఆస్తిపాసులు నావాంఛకి కళ్ళెంవేసిలాగేస్తున్నయ్" అన్నాడు శంకరం. లక్ష్మిముఖం వికసించింది,

"ఔనా మరి... ఎంతహోదాలోవున్నవా డొచ్చినా డబ్బుంటూ వుండొద్దటండీ?" అంది నవ్వుతూ.

"అందుకేకదూ, నేనూ 'వూ' కొట్టాను. అవుతే చదువు మాన్పించేయమంటున్నా దన్నమాట."

"ఆ మాట సూటిగా చెప్పకపోయినా, అర్థంమాత్రం అదే."

"సరే—అవుతే మాన్పించేద్దాం — అని యిలా అన్నాడో లేదో జయ తనగదినుండి వస్తూ,

"ఏమిటినాన్నా, మాన్పించేద్దామంటున్నారు?" అంది. శంకరంకి పచ్చివెలక్కాయ నోట్లో పడినట్టయింది."

"ఏమీ లేదే అమ్మాయ్"అనేశాడు నిజాన్ని తననోటితో చెప్పలేక లక్ష్మి అందుకుంది

"దాస్తున్నారేం? నీచదువు మాన్పించేయ మంటున్నాడే జయా!" అంది లక్ష్మి. జయ తృళ్ళిపడింది.

"ఎవరమ్మా...? అంది జయ.

"కామేశం మావయ్యే..." అంది లక్ష్మి నవ్వుతూ. జయకి వుక్రోషం వూగిసలాడింది. "ఆయనెవరు, నాచదువు మాన్పించడానికి?" అంది కోపంగా.

"అంత కోపమెందు కమ్మాయ్... కామేశం మెవరంటావేమిటి?" అన్నాడు శంకరం.

"తప్పు జయా! అంత తొందరపాటుండకూడదమ్మాయ్. ఆ మూడుముళ్ళూ పడ్డాక ఈ తొందరపాటుంటే యింకేం చెప్పను...?" అంది లక్ష్మి. జయ కిప్పు డర్థమయింది. తను ఏవ్యక్తినుండి దూరంగా వుండాలనుకుందో, ఆ వ్యక్తి మరింత సన్నిహితుడౌతున్నాడు. అతనికోసం చదువుమానేయాలి. తన జీవితంలో మరి భవిష్యత్తు శూన్యం... అనుకుంది. ఆమెకి ఆవేశం ఆగిందికాదు.

"అందుకా చదువు మాన్పిస్తామంటున్నారు...నేను మొదట్లోనే చెప్పేశానమ్మా! మామయ్యని పెళ్ళిచేసుకోనని" అంది వుద్రేకంతో జయ.

"చూశావుటే లక్ష్మీ! నేను చెప్పలేదూ?" అన్నాడు శంకరం భార్య మొహంలోకి చూస్తూ లక్ష్మికి కోపం వచ్చింది. కోపంలో వుడుకుమోత్రసంతూడా వుంది. తన తమ్ముడికేం తక్కువయిందని.

"మీరూరుకోండి... కామేశంకి యేం తక్కువనే పెళ్ళిచేసుకోవు? ధనం లేదా? కావల్సినంత వుంది; చదువుంది, వుద్యోగముంది ఇంకేంకావాలి?" అంది లక్ష్మి.

"ఇవన్నీ వుండగానే సరా...చేసే వుద్యోగం ఏంవిటి? గుమస్తా యేగా!. నాకవసరంలేదు." అంది చీత్కరించు కుంటున్నట్టుగా. లక్ష్మి మనసు చివుక్కుమంది.

"ఇంకెవరు కావాలే? నిన్ను పెళ్ళాడాలని ఆఫీసర్లెవరూ వచ్చి పడిపోవటంలేదు" అంది లక్ష్మి కోపంగా.

"వస్తారమ్మా! వాళ్ళే వస్తారు...నన్నింకా చదువుకో నీయండి" అంది జయ విసుగ్గా.

"పిల్లేదు. ఈరోజుతో నీచదువుకి స్వస్తి..." అంది కఠినంగా లక్ష్మి. అంత కఠినంగా అన్నందుకు తరువాత బాధ పడింది. మళ్ళీ కాస్త చల్లబడి అంది.

"నీకేం పిచ్చిగాని పట్టలేదు కద జయా! గుమస్తాఉద్యోగంమాత్రం వుద్యోగంకాదూ? పోనీ పేదరికం అనుభవిస్తున్నాడా అంటే, కావల్సినంత ఆస్తి వుంది. యింకేంకావాలి"

"నువ్వేన్నైనా చెప్పు నాకిష్టంలేదమ్మా" ఖచ్చితంగా చెప్పేసింది జయ. తల్లీ కూతుళ్ల మధ్య వాదం పెరిగిపోతున్నందుకు శంకరమే జోక్యం కలుగజేసుకున్నాడు.

"అలాగంటె యెట్లా అమ్మాయ్...బీదవాళ్ళయి మీచు ల్లాంటి ఈ రెండు వంశాలమధ్య గల సన్నిహితత్వం యెలా పోగొట్టుకుంటాం చెప్పు." అన్నాడు శంకరం.

"అందుకని నాకిష్టంలేని భర్తను ముడిపెడతారా!" అంది యేడుపుస్వరంలో జయ. శంకరం చిన్నగా నవ్వాడు.

"నీ అయిష్టతలో ఓ ప్రత్యేకతవుంది జయా! ఆయన గుమస్తాజీవితం గడుపుతున్నాడనే కదూ, నీచిన్నచూపు. అది మాత్రం వుద్యోగంకాదూ? వారికిమాత్రం హృదయం, వ్యక్తిత్వం. వుండవూ? గుమస్తాగిరంటే అంతగా అసహ్యపడ తావెందుకో నా కర్థంకాదమ్మాయ్... అందరూ ఆఫీసరుల వ్వాలనివుంటె మరి గుమస్తాలెవరు?" అన్నాడు శంకరం. సరళ అన్నమాటలే తండ్రినోటినుండి మరి కాస్త హెచ్చుగాపు తో... తనిక యెంత ప్రయత్నించినా లాభంలేదనుకుంది జయ.

"ఎందుకు నాన్నా యింతవుపన్యాసం? మీరంతగా పట్టుబడితే నేనేం చేస్తాను? నే ననుకున్నా కాస్త హోదాలో వున్న వ్యక్తిని వివాహం చేసుకోవాలని ... నా ఆశయాలు కలలో మాటగా మారిపోయాయ్. నా ఆశాసౌధాలు కూలి పోయాయ్. ఏంచేస్తాను! మీయిష్టం..." అంది జయ తల దించుకుంటూ. లక్ష్మి పెదాలపై చిరునవ్వు తొణికిసలాడింది. శంకరం సంతృప్తిగా నవ్వాడు.

"అమ్మాయ్! యిప్పటికి గావోను, కాస్త తొందరపడ్డావ్...హోదాలో యేముందే! ధనంకి లోటులేకుండా వుండాలిగా..." అంది లక్ష్మి కూతురుతల నిమురుతూ.

"వుద్యోగం లేకపోయినా అంత బాధలేదమ్మా" అంది జయ. ఆమె ఇంకా ఆ గుమస్తాగిరిపై న్యూనత విడిచిపెట్టలేదు. శంకరం నవ్వుతూ "అంతేగాని గుమస్తాని మాత్రం పెళ్ళాడ నంటావ్—పిచ్చి పిల్లా! నీ అమాయకత్వాని కేమనాలో అర్థంకాకుండావుంది. ఏ వుద్యోగమవుతే యేముమ్మా ... వున్నదాంతో సంతృప్తిపడాలిగాని, నేనింత హోదాలోవున్నా నన్నమాటేగాని, నాకేం శాంతివుంది చెప్పు?" అన్నాడు. జయ యేం మాట్లాడలేదు.

అప్పుడే బయట పోస్టుమేన్ కేకవిని శంకరం వెళ్ళి వుత్తరం తీసుకుని విప్పిచదువుతూనే భార్య, కూతురు దగ్గరకి వచ్చాడు వుల్లాసంగా.

"ఎక్కడినుంచండీ వుత్తరం?" ఆడవాళ్ళ స్వభావం పోగొట్టుకోకుండా ప్రశ్న వేసింది లక్ష్మి.

"మీ తమ్ముడి దగ్గర్నుండి" అన్నాడు శంకరం నవ్వుతూ.

"ఏం రాశాడండీ?"

"మీ అమ్మా, అతడూ, కలిసి రేపువుదయం బండిలో వస్తున్నారుట."

"అన్నీ నిశ్చయించుకుపోవటానికే ననుకుంటాను" నవ్వుతూ అంది లక్ష్మి.

"మీ వాళ్ళకి మరీ తొందరగా వుందిలెద్దూ!"

"ఇంక కాలయాపన చెయ్యటం మా అమ్మ కిష్టం లేదండీ... 'శుభస్య శీఘ్రం' అంటుంది."

"మనమేం తక్కువ తిన్నాంలే... మనమూ అలాగే అందాం..." అన్నాడు శంకరం నవ్వుతూ.

జయ తలదించుకుని అక్కణ్ణించి వెళ్ళిపోయింది. నిస్సహాయతవల్ల యెదిరించలేకపోతోందిగాని, ఆమె హృదయంలో బాధగానేవుంది. ఏ గుమస్తా జీవితాన్ని వ్యాఖ్యానించి తన స్నేహితురాలిపై సానుభూతి చూపిందో, ఆ గుమాస్తా జీవితంలోకే తనూ వెళ్తోంది సరళ మొహాం యెలా చూడ్డం! తను ఆమెను చిన్నపుచ్చింది... యీ ఆలోచనలతోనే ఆమె హృదయం బరువెక్కింది...

అనుకున్నట్టుగానే జయ చదువుకి స్వస్తిచెప్పింది. లోలోపల యెంత బాధపడింది, తన వివాహం మాట వస్తే చదువు మానేసినందుకు. కాని యేంచేస్తుంది? పరిస్థితులిలా పరిణమించాయి. కామేశం, వాళ్ళమ్మ రావటం పెళ్ళిమాటలు నిశ్చయించుకుని పోవడం జరిగిపోయింది జయ కాలేజీకి వెళ్ళటం మానేసిన అయిదోరోజున సరళయింటికి వెళ్ళింది. తనహృదయంలో మరుగుతున్న బాధని సరళను క్షమాపణ కోరుకుని చల్లార్చుకోవాలనుకుంది.

"రావే జయా! యిప్పుడొచ్చావేం? కాలేజికి పోలేదూ" అంది సరళ జయని కూర్చోమంటూ. జయ నిట్టూర్పుతో కూర్చుంది. నిజంగా సరళ మొహంలోకి చూడ్డానికే ఆమెకి భయమేస్తోంది.

"లేదే! చదువుకి స్వస్తి చెప్పానే" అంది బాధగా. సరళకేం అర్థంకాలేదు. అకస్మాత్తుగా యెందుకీ మార్పు వచ్చిందా అనుకుంది.

"ఏం? ఎందుకనీ?" అంది సరళ ఆశ్చర్యపోతూ.

"నా పెళ్ళి నిశ్చయమయ్యిందే!" అంది ముఖం దించుకుని.

"అరె...నాకు తెలీదే! ఎవరా అదృష్టవంతుడు?" అంది నవ్వుతూ సరళ.

"యీ దురదృష్టవంతురాలికి అదృష్టవంతు డెలా తటస్థపడతాడులే." అంది మెల్లగా. సరళ అర్థంచేసుకుంది, జయ యెందుకో బాధపడుతూందని.

"ఎందుకే అలాబాధ పడతావ్." అంది సరళ ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"ఔను మరి... నీ గుమస్తాభర్తని గురించి నిన్నంతగా విమర్శచేశానా... అల్లాంటి గుమాస్తాయే నాకూ భర్త అయ్యాడు" అంది జయ. కాని సరళ నమ్మలేదు...

"వూరుకుందూ! వేళాకోళానికి వేళా, పాలా వుండొద్దూ!" అంది నవ్వుతూ సరళ.

వేళాకోళం కాదు సరళా! నిజంచెబుతున్నా. నా మేనమామ వున్నాడని చెప్పలేదూ... అతనే చివరికి..."అంది తనేదో అరణ్యామధ్యానికి పోతున్నట్టుగా బాధపడుతూ. సరళకీవ్వాడు నమ్మకతప్పిందికాదు.

"బాధపడి సాధించే దేముందే జయా! ఎవరి కేది ప్రాప్తమో యెవరికి తెలుసు? ఏదైనా మనమంచికే అనుకో కూడదూ!" అంది బోధపర్చేధోరణిలో సరళ.

"ఎలాగో మనం సంతృప్తిపడాలి. మరి...నే నప్పుడన్న వన్నీ మనసులో వుంచుకోకేఁ..." అంది జయ.

"పిచ్చిగాని పట్టలేదుకదా!" చంపక వూరుకో మరి... ఆ! అవుతే పెళ్లెప్పుడూ?"

894-81331
HAN

"సరిగ్గా పదిహేనురోజు లుందే!"

"Good news జయా! అఁ, చెప్పటం మర్చిపోయాను. మా ఆయనకి యిక్కడికే బదిలీఅయింది" అంది నవ్వుతూ సరళ.

ACC NO. 94898

"అదృష్టవంతురాలివి సరళా" అంది జయ నవ్వుతూ.

"నువ్వుమాత్రం కానట్టు..." కాస్త గట్టిగా నవ్వుతూ.

"సరే...వస్తానే మరి...సాయంకాలం యింటికొస్తావు కదూ!" అంటూ లేచింది జయ. సరళ కూడా లేచి ఆమె వెనువెంటనే నడుస్తూ

84 . 1200

"అలాగే...తప్పకుండా వస్తాను" అంది సరళ. జయ కనుచూపుమేర దాటేవరకు సరళ గుమ్మంలో నిల్చుని తరు వాత లోపలికొచ్చేసింది.